# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 18-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ భారత్, చైనా సంబంధాలలో నిజాయితీతో కూడిన నిర్మాణాత్మక విధానం అవసరమని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జై శంకర్ పేర్కొన్నారు.

❖ భారతీయ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని 2035 నాటికి ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.

❖ దేశంలో పోర్టుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోందని కేంద్ర మంత్రి శరబానంద్ సోనోవాల్ వెల్లడించారు.

❖ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఈరోజు ఫోన్ చేసి పలు అంశాలపై చర్చించారు.

❖ రాబోయే వారం రోజులు గోవా, మహారాష్ట్ర గుజరాత్‌లలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది.

=========================

భారత్, చైనా సంబంధాలలో నిజాయితీతో కూడిన నిర్మాణాత్మక విధానం అవసరమని విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్ పేర్కొన్నారు. న్యూ ఢిల్లీలో ఈ రోజు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యితో కలసి ప్రతినిధి స్థాయి చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇరు దేశాలూ క్లిష్ట సమయాన్ని చూశాయని, ఇప్పుడు సానుకూల దృక్పధంతో ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దీనికి రెండు వైపుల నుండి తగిన సహకారం అవసరమని చెప్పారు. భారత్, చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉభయ దేశాలు పరస్పరం ప్రయోజనాల కోసం పని చేస్తాయని జై శంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

=========================

భారతీయ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని 2035 నాటికి ఏర్పాటు చేస్తామని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖా మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. అంతరిక్షంలో భారతదేశ పాత్ర అనే అంశంపై లోక్‌సభలో ఈ రోజు జరిగిన ప్రత్యేక చర్చలో జితేంద్ర సింగ్ మాట్లాడుతూ... 2040 నాటికి భారతీయ సిబ్బందితో కూడిన మిషన్‌ను చంద్రునిపైకి పంపడం ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన వ్యోమగామి శుభాన్షు శుక్లా సాధించిన విజయాన్ని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. శుభాన్షు శుక్లా సాధించిన విజయానికి దేశం మొత్తం గర్విస్తోందని పేర్కొన్నారు.

==========================

దేశంలో పోర్టుల సమగ్ర అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తోందని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖా మంత్రి శరబానంద్ సోనోవాల్ తెలిపారు. రాజ్యసభలో ఈ రోజు ఇండియన్ పోర్ట్స్ బిల్లు 2025ను కేంద్రమంత్రి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ బిల్లు వ్యాపార సౌలభ్యాన్ని సులభతరం చేస్తుందని తెలిపారు. అలాగే దేశ తీరప్రాంతాన్ని గరిష్టంగా ఉపయోగించుకునేందుకు అవకాశం కల్పిస్తుందని చెప్పారు. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని కేంద్రమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 35 సెకన్లు)

==========================

ప్రతిపక్ష పార్టీ సభ్యుల నినాదాల నేపథ్యంలో లోక్‌సభను రేపటికి వాయిదా వేశారు. బీహార్‌లో ప్రత్యేక ఓట్ల సవరణ అంశంపై సభలో చర్చకు విపక్షాలు పట్టుపట్టాయి. దీంతో ఈ రోజు సభ పలు మార్లు వాయిదా పడింది. తొలుత సభ ఉదయం 11 గంటలకు సమావేశమైనపుడు ప్రత్యేక ఓట్ల సవరణ అంశంపై చర్చ కోరుతూ ప్రతిపక్ష పార్టీల సభ్యులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం బిర్లా విపక్ష సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నినాదాలకు బదులుగా ప్రశ్నలు అడిగితే, అది దేశ ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు. అయినా సభ్యులు వినిపించుకోకపోవడంతో సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. ఆ తరువాత మరోసారి సమావేశం అయినా సభలో గందరగోళం చోటు చేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన వ్యోమగామి శుభాన్షు శుక్లాను లోక్ సభ తరఫున స్పీకర్ ఓం బిర్లా అభినందించారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ లోక్ సభలో ప్రవేశపెట్టిన "జన్ విశ్వాస్ నిబంధనల సవరణ బిల్లు 2025"ను మరింత పరిశీలన కోసం సెలెక్ట్ కమిటీకి సూచించాలనే ప్రతిపాదనను లోక్ సభ ఆమోదించింది.

విరామం

==========================

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఈరోజు ఫోన్ చేసి పలు అంశాలపై చర్చించారు. ఈ విషయాన్ని ప్రధాన మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. భారత్, రష్యా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై నరేంద్ర మోదీ, పుతిన్ మాట్లాడారని పేర్కొంది. ఇరు దేశాలకు సంబంధించిన అనేక అంశాలపై ఎప్పటికప్పుడు సంప్రదింపులు కొనసాగించాలని ఇరువురు నిర్ణయించారని వెల్లడించింది. ఇదిలా ఉండగా, రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య ఉద్రిక్తతలపైన భారతదేశం వైఖరిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుతిన్ తో జరిగిన ఫోన్ సంభాషణలో పునరుద్ఘాటించారని పేర్కొంది. శాంతియుత మార్గాన్ని అనుసరించాలని దానికి భారత్ అన్ని విధాలుగా మద్దతిస్తుందని నరేంద్రమోదీ చెప్పారని ప్రధాన మంత్రి కార్యాలయం వెల్లడించింది.

==========================

మహారాష్ట్ర గవర్నర్, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ ని ప్రధానమంత్రి అభినందించారు. ఆ వివరాలను నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. రాధాకృష్ణన్ సుదీర్ఘ ప్రజా సేవ, అనుభవంతో దేశ కీర్తిని పెంచారని కొనియాడారు. అదే అంకిత భావంతో దేశానికి సేవలు కొనసాగించాలని కోరుకుంటున్నానని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఉపరాష్ట్రపతి ఎన్నికపై చర్చించడానికి జరిగిన NDA కోర్ గ్రూప్ సమావేశం ఢిల్లీలోని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి నివాసంలో కొద్ది సేపటి క్రితం ముగిసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్డీయే కూటమికి చెందిన ఇతర నాయకులు రేపటి సమావేశంలో ఉపరాష్ట్రపతి పదవికి NDA అభ్యర్థిగా సి.పి.రాధాకృష్ణన్ పేరును ప్రతిపాదిస్తారు.

=========================

ఆంధ్రప్రదేశ్ కు 29 వేల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయిస్తామని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖల మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా హామీ ఇచ్చారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ ఈ రోజు కేంద్ర మంత్రిని కలుసుకుని ఖరీఫ్ సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియాను కేటాయించాలని కోరారు. ఈ నెల 21 నాటికి యూరియాను అందిస్తామని జె.పి. నడ్డా ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అదే విధంగా స్థానిక పరిశ్రమలను ప్రోత్సహించడానికి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడానికి రాష్ట్రంలో ప్లాస్టిక్ పార్క్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని నారా లోకేష్ ఈ సందర్భంగా కోరారు.

=========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=========================

రానున్న ఏడు రోజులలో గోవా, మహారాష్ట్ర, గుజరాత్‌లలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. అదే విధంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కొంకణ్, మహారాష్ట్రలలో భారీ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాల వెంబడి పశ్చిమ-మధ్య వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం కొనసాగుతోందని వెల్లడించింది. ఇది వాయుగుండంగా మారి రేపు మధ్యాహ్నం నాటికి తీరం దాటే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారి ఉమాకాంత్ దాస్ వెల్లడిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

=========================

=========================